
సాక్షి
కృష్ణాజిల్లా
ఆదివారం । 6 । జూలై । 2025



నేడు శాకంబరిగా తిరుపతమ్మ

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారు ఆదివారం శాకంబరిగా దర్శనమివ్వనున్నారు. శనివారం భక్తులు కూరగాయలు, పండ్లతో మాలలు తయారు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 524.70 అడుగుల వద్ద ఉంది. ఇది 157.9860 టీఎంసీలకు సమానం.



జగన్నాథుడి రథయాత్ర

ఆటోనగర్: విజయవాడ ఇస్కాన్ మందిరం ఆధ్వర్యాన శనివారం కానూరు నుంచి ఆటోనగర్ వరకు జగన్నాథ రథయాత్ర వైభవంగా నిర్వహించారు.

వెంటాడుతున్న సీజనల్ భయం

- జిల్లాలో పెరుగుతున్న డెంగీ, టైఫాయిడ్, అతిసార కేసులు
- ఆరు నెలల్లో 1.04 లక్షల రక్త నమూనాలు పరీక్ష.. రోజుకు సగటున 600 మంది రోగులు
- రోగులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ ఆస్పత్రులు



మచిలీపట్నం సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిలో కిటకిటలాడుతున్న ఔట్ పేషెంట్ నమోదు కౌంటర్

మచిలీపట్నంఅర్బన్: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రధానంగా టైఫాయిడ్, డెంగీ లక్షణాలున్న కేసులు అధికంగా నమోదవుతున్నాయి. దీనికి తోడు విషజ్వరాలు, అతిసార కూడా ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. జిల్లాలో గడిచిన ఆరు నెలల్లో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, అతిసారం, విషజ్వరాలు వంటి వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు 1,04,924 రక్త నమూనాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేకరించారు. రోజుకు సగటున 600 మంది ఏదో ఒక సీజనల్ వ్యాధి బారిన పడి, చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యాధుల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యశాఖ లెక్కలపై అనుమానాలు..

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 8,610 సాధారణ జ్వరాలు, 447 అతిసార, 972 టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయని వైద్యశాఖ లెక్కలు చెబుతోంది. ప్రభుత్వ ఆస్పత్రులు రోగులతో రద్దీగా ఉన్న ప్రస్తుత పరిస్థితిలో.. అంకెలు నిష్పక్షపాతంగా ఉన్నాయా అనే సందేహాలు ప్రజల్లో ఉన్నాయి. ప్రస్తుత దశలో నిజానికి వైద్యశాఖ లెక్కల కంటే మరింత ఎక్కువగా ఉండొచ్చన్న అభిప్రాయాలు ఉన్నాయి.

ప్రభుత్వ ఆస్పత్రులు కిటకిట..

జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇంట్లో ఒకరి తర్వాత మరొకరు విషజ్వరాలతో అల్లాడుతున్నారు. ప్లేట్ లెట్స్ తగ్గిపోవడంతో నీరసించి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ప్రధానంగా జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలతో అధిక శాతం మంది బాధపడుతున్నారు. జ్వరం తగ్గినా ఒళ్లు నొప్పులు మాత్రం త్వరగా తగ్గట్లేదు. జ్వరం వచ్చిన రెండు రోజుల్లోనే బాధితులు నీరసిస్తున్నారు. డెంగీ, మలేరియా లక్షణాలతో మరికొందరు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి.

నీటి సరఫరాలో కాలుష్యం..

ప్రజలకు అందుతున్న తాగునీటి సరఫరాలో ఎక్కువగా కలుషితం కావడం పెద్ద సమస్యగా మారింది. కొన్ని చోట్ల డ్రెయినేజీ నీరు తాగునీటి పైపుల్లోకి చేరడం, నీటి శుద్ధి ప్లాంట్లు సమర్థవంతంగా పనిచేయకపోవడంతో ప్రజలు అపరిశుభ్రమైన నీటిని సేవిస్తున్నారు. ఇది టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులకు కారణమవుతోంది. ప్రతి బుధవారం నీటి నమూనాలు పరీక్షలు నిర్వహిస్తోందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. అయినా టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ప్రబలుతుండడం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది.

వైరల్ జ్వరాలు, టైఫాయిడ్ కేసుల ఉధృతి



జిల్లాలో ప్రజారోగ్య పరిస్థితి తీవ్ర ఆందోళన కలిగించే స్థితిలో ఉంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 71 ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోజూ వేలాది మంది రోగులు వైద్య సేవల కోసం తరలివెళ్తున్నారు. వాటిలో ఒకటి బోధన ఆస్పత్రి, ఒకటి ఏరియా ఆస్పత్రి, 7 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 48 ప్రైమరీ హెల్త్ సెంటర్లు, 14 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. సాధారణ రోజుల్లో బోధన ఆస్పత్రికి రోజుకు 250 నుంచి 300 వరకు రోగులు వస్తుండగా, ఏరియా ఆస్పత్రికి 150-200, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు 100-150, ప్రైమరీ, అర్బన్ హెల్త్ సెంటర్లకు 50-100 వరకు ఓపీ నమోదు అవుతోంది. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రతి 10 మందిలో ఏడుగురికి వైరల్ జ్వరాలు, ముగ్గురికి టైఫాయిడ్ లక్షణాలు ఉంటున్నాయని వైద్యవర్గాలు చెబుతున్నాయి.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



డెంగీ, మలేరియా వ్యాధి ప్రబలడానికి దోమలే ప్రధాన కారణం. కలుషిత నీరు, ఆహారంతో టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు వస్తాయి. తాగునీరు పరీక్షలు నిర్వహిస్తున్నాం. సీజనల్ వ్యాధులు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. జిల్లా వైద్యఆరోగ్య శాఖ, పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా శాఖల సమన్వయంతో అతిసారం, టైఫాయిడ్, విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ ఎస్.శర్మిష్ఠ, డీఎంహెచ్ఓ

10న పేరెంట్స్, టీచర్ల సమావేశం

చిలకలపూడి(మచిలీపట్నం): విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఈ నెల 10వ తేదీన మెగా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర – 2047ఏర్పాటుకు దోహదపడే విధంగా 10 సూత్రాల్లో భాగంగా మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాల పెంపుదల ఒక భాగంగా, పాఠశాలల్లో పిల్లలకు చిన్ననాటి నుంచే పునాది వేయాలనే భావనతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో జరిగన సమావేశం కంటే ఈసారి ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు, ఎయిడెడ్ తదితర పాఠశాలల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం జరుగుతుందని వివరించారు. జూనియర్ కళాశాలల్లో కూడా సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా రావాలని కోరారు. వారి పిల్లల భవిష్యత్తు ఎలా ఉంది, వారు ఎలా చదువుతున్నారు, ఏమేం చదువుతున్నారు, తల్లిదండ్రుల నుంచి ఏమైనా చేయూత అవసరం ఉందా అని తెలుసుకోవటంతో పాటు సలహాలు ఇవ్వవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఈ సారి విద్యార్థులందరికీ హోలీస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను ఇవ్వనున్నట్లు తెలిపారు. తల్లి పేరుతో మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి విద్యార్థిని భాగస్వామ్యం చేస్తున్నామని పేర్కొన్నారు. వారికి చిన్నప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణపైన తదితర అంశాలపై అవగాహన కల్పించడమే తమ ఉద్దేశమని తెలిపారు. మొక్కలు తీసుకుని పెంచిన విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టు అందజేస్తామని వివరించారు. తల్లిదండ్రులు వారి పిల్లలు నిజంగా ఏమి కావాలని కోరుకుంటున్నారో తెలియజేస్తూ చిన్న వ్యాసాలను రాసి ఇస్తే వాటిని ఆయా పాఠశాలల్లో ప్రదర్శనగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ సమావేశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మకు నృత్యనీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో నగరానికి చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై వి.మనోజ్ఞ కామేశ్వరి పర్యవేక్షణలో 15 మంది చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి దర్శనానంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు వీరి నృత్యాన్ని వీక్షించి అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.

నర్సపూర్-తిరువన్నమలై మధ్య ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నర్సపూర్-తిరువన్నమలై మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్వో నుస్రత్ మండ్రుప్కర్ శనివారం ఒక ప్రకటలో తెలిపారు. నర్సపూర్-తిరువన్నమలై ప్రత్యేక రైలు (07219) ఈ నెల 9, 16, 23, ఆగస్టు 6, 13, 20, సెప్టెంబర్ 3, 24 తేదీల్లో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు నర్సపూర్‌లో బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారుజామున 4.55 గంటలకు తిరువన్నమలై చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07220) ఈ నెల 10, 17, 24, ఆగస్టు 7, 14, 21, సెప్టెంబర్ 4, 25 తేదీల్లో గురువారం ఉదయం 11 గంటలకు తిరువన్నమలైలో బయలుదేరి, మరుసటి రోజు అర్ధరాత్రి 2 గంటలకు నర్సపూర్ చేరుకుంటుంది. రెండు మార్గాల్లో ఈ రైళ్లు పాలకొల్లు, భీమవరం జంక్షన్, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, చిత్తూరు, కాట్‌పాడి, వెల్లూరు స్టేషన్లలో ఆగుతాయి.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శుల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన పలువురిని నియమించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా మండవ శ్రీనివాస గౌడ్(జగ్గయ్యపేట), కాల్వ వాసుదేవరావు (నందిగామ), ముంగనూరు కొండారెడ్డి (నందిగామ), వెల్లూరి ఈశ్వరప్రసాద్ (విజయవాడ ఈస్ట్), కర్నాటి రాంబాబు(విజయవాడ వెస్ట్), షేక్ సలీం(విజయవాడ వెస్ట్), షేక్ హయత్ షరీఫ్(విజయవాడ వెస్ట్), గుండె సుందర్‌పాల్ (విజయవాడ సెంట్రల్) నియమితులయ్యారు.

కృష్ణా జిల్లా..

రాష్ట్ర కార్యదర్శులుగా భీమవరపు కోటిరెడ్డి,(పెనమలూరు), యారా సాయి ప్రశాంత్(పామర్రు) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

విద్యుత్ భారాలు మోపితే సహించం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపితే సహించబోమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ హెచ్చరించారు. విద్యుత్ భారాలకు నిరసనగా రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో శనివారం ధర్నా చౌక్ వద్ద ధర్నా జరిగింది. నగర కార్యదర్శి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, పెంచిన ట్రూ అప్ చార్జీలు తగ్గించాలని, అదానీతో చేసుకున్న ఒప్పందాన్ని విరమించుకోవాలన్నారు. విద్యుత్ చార్జీల పెంపుపై చంద్రబాబు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు ..అధికారంలోకి వచ్చి ఏకంగా రూ.15,400 కోట్లు ప్రజలపై భారాన్ని మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పగలగొట్టండని చెప్పిన నారా లోకేష్ అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల దిష్టి బొమ్మను దహనం చేశారు. ధర్నా కార్యక్రమంలో సీపీఐ అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో మట్టి మాఫియా ఆగడాలు

- మట్టి దందాను అడ్డుకుని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన జనసేన కార్యకర్త
- ఫిర్యాదు చేస్తావా అంటూ తెలుగు తమ్ముళ్ల దాడి
- పోలీసులు పట్టించుకోలేదంటూ బాధితుడి ఆవేదన

కోనేరుసెంటర్: మంత్రి ఇలాకాలో మట్టిమాఫియా రెచ్చిపోతోంది. పగలు, రాత్రి మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ధనాన్ని దోచుకోవడమే కాకుండా జనానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మండలంలో ఎక్కడా చూసినా కూటమి నేతల కనుసన్నల్లో జరిగే మట్టి దందాను అడ్డుకునేందుకు అధికారులు సైతం సాహించడం లేదు.

టీడీపీ నేతల మట్టిదందాపై జనసేన కార్యకర్త ఫిర్యాదు

మండలంలో మట్టి తరలింపుపై టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య వైరం రగులుతోంది. బందరు మండలం పెదకరగ్రహారం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వడ్డీకాసులు, తోట సాయి కొన్ని రోజులుగా మట్టిని అక్రమంగా తవ్వుకుని అమ్ముకుంటున్నారు. వీరి అవినీతి అక్రమాలతో విసుగుచెందిన మట్టా వెంకటరాంబాబు అనే జనసేన కార్యకర్త మట్టి ట్రాక్టర్లను అడ్డుకుని ఇళ్ల మధ్య నుంచి ట్రాక్టర్ల రాకపోకలేంటంటూ నిలదీశాడు. అనంతరం తహసీల్దార్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. సిబ్బంది మట్టి తవ్వుతున్న ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లిపోయారు.



టీడీపీ నేతల దాడిలో గాయపడిన జనసేన కార్యకర్త మట్టా వెంకటరాంబాబు

జనసేన కార్యకర్తపై తమ్ముళ్ల దాడి..

గ్రామంలో జరుగుతున్న మట్టి దందాపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడన్న కోపంతో రెచ్చిపోయిన వడ్డీకాసులు, తోట సాయి కలిసి మరో 20 మంది టీడీపీ కార్యకర్తలతో కలిసి అర్ధరాత్రి జనసేన కార్యకర్త రాంబాబు ఇంటిపైకి వెళ్లి అసభ్యకరంగా మాట్లాడారు. ఇంట్లో నిద్రిస్తున్న రాంబాబును బలవంతంగా బయటికి లాక్కొచ్చి మూకుమ్మడి దాడికి దిగారు. ఒంటిపై దుస్తులను చింపేసి విచక్షణారహితంగా చావగొట్టారు. అడ్డొచ్చిన రాంబాబు తల్లిని దుర్భాషలాడుతూ బెదిరించారు. దీంతో ఆమె కొడుకుని లాక్కెళ్లి తలుపులు వేసుకుంది. వారు మరుసటి రోజు నీ అంతూ చూస్తామంటూ హెచ్చరించారు. జరిగిన ఘటనపై బాధితుడు తనకు రక్షణ కల్పించాలంటూ పోలీసులకు ఫోన్ చేసినా స్పందించలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

సహకార వ్యవస్థ బలోపేతంతో అభివృద్ధి

మచిలీపట్నంఅర్బన్: జిల్లాలో సహకార వ్యవస్థ బలోపేతంతోనే అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. స్థానిక మత్స్యశాఖ సంయుక్త సంచాలకుల కార్యాలయంలో శనివారం 103వ అంతర్జాతీయ సహకార దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొన్నారు. తొలుత కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. సహకార సంఘాల పతాకాన్ని ఎగరవేసి, సహకార గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంపద సృష్టి అనే అంశం కేవలం ప్రభుత్వంపైనే కాకుండా బాధ్యత సమాజంపై కూడా ఉందన్నారు. సృష్టించిన సంపద కొంత మంది పెట్టుబడిదారుల వద్దనే ఉంటుందని దాంతో సమాజంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. అందుకే సంపద వికేంద్రీకరణతో పాటు పంపిణీ జరగాల్సిన అవసరం ఉందన్నారు. సహకార సంఘాలు ఫెడరేషన్‌గా ఏర్పడి, సొంతంగా యూనిట్లు నెలకొల్పుకుంటే భాగస్వాములయిన ప్రతి ఒక్కరికీ లాభాలు సమానంగా పంచుకునే అవకాశం ఉంటుందన్నారు. అమూల్ పాల ఉత్పత్తుల సహకార సంఘమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. మత్స్యకార సంఘాలు సొంతంగా బ్రాండ్ యూనిట్లు ఏర్పాటు చేసుకుని మత్స్య సంపద ఉత్పత్తులు అమ్మకాలు చేపట్టాలన్నారు. ఆక్వా ఉత్పత్తులను రష్యాకు ఎగుమతి చేయడానికి నిర్దిష్టమైన ప్రణాళికను, ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు అయ్యా నాగరాజ, డీసీఓ చంద్రశేఖర్, జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు నాగరమేష్ తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా మొక్క నాటుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

గృహాల నిర్మాణంలో వెనుకబడి ఉన్నాం

- లక్ష్య సాధనపై దృష్టి పెట్టండి
- కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో గృహాల నిర్మాణంలో చాలా వెనుకబడి ఉన్నామని లక్ష్యాలను సాధించడానికి ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం జెడ్పీ సమావేశపు హాలులో గృహ నిర్మాణాలు, స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్, పీ-4 కార్యక్రమాలపై క్షేత్రస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లడుతూ జిల్లాలో 10,007 గృహాల నిర్మాణాలు జరగాల్సి ఉండగా ఇప్పటి వరకు 3,603 మాత్రమే పూర్తయ్యాయన్నారు. గత సమావేశం నుంచి ఇప్పటి వరకు గృహ నిర్మాణంలో సరైన పురోగతి కనిపించడం లేదని ఇకనైనా దృష్టిసారించి లక్ష్యాల మేరకు పూర్తి చేయాలన్నారు. ఈ నెల 19వ తేదీ నాటికి నిర్మాణాల్లో పురోగతి కనిపించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయంపై అవగాహన కల్పించి నిర్మాణం జరిగేలా చూడాలన్నారు. గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేవని తన దృష్టికి వచ్చిందని తెలిపారు. పీ-4లో ప్రతి ఎంపీడీవో సభ్యులుగా ఉన్నారని గ్రామాల్లో కొన్ని ట్రస్టులు, సొసైటీలు ఉంటాయని వాటిని గుర్తించి వారిని మార్గదర్శిగా పేదవారిని ఆదుకోవడానికి అనుసంధానం చేయాలన్నారు. సమావేశంలో గృహనిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకట్రావు, జెడ్పీ డెప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్, డీపీవో జె.అరుణ, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, మెప్మా పీడీ పి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

దార్శనిక ప్రణాళికలతో స్వర్ణాంధ్ర

ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దార్శనిక ప్రణాళికలతో స్వర్ణాంధ్ర సాధించవచ్చని దానికి జిల్లాలో నియోజకవర్గాల ముసాయిదాలు తయారుచేశామని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా దార్శనిక కార్యాచరణ ప్రణాళిక యూనిట్ చైర్మన్ సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం మంత్రి సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన జిల్లా, నియోజకవర్గ దార్శనిక ప్రణాళికలు, స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్‌పై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం జరిగింది. ప్రణాళికపై కలెక్టర్ లక్ష్మీశ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యేలు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం

- సమయం, డబ్బు ఆదా
- జిల్లాలో 44 బెంచ్‌ల ద్వారా 10,385 కేసుల పరిష్కారం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి



ప్రీలిటిగేషన్ కేసులో అవార్డును అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి

చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ లోక్అదాలత్‌తో కేసులు సత్వరం పరిష్కారమవుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాసదన్‌లో లోక్అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, మోటారు వాహన ప్రమాద క్లయిమ్‌లు రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

10,385 కేసులు పరిష్కారం

ఉమ్మడి కృష్ణా జిల్లాలో జాతీయ లోక్అదాలత్ కార్యక్రమాన్ని జిల్లాలోని ఆయా కోర్టుల్లో 44 బెంచ్‌లు ఏర్పాటు చేశారని వీటితో 10,385 కేసులు పరిష్కారమయ్యాయని న్యాయమూర్తి జి.గోపి తెలిపారు. వీటిలో 9,232 క్రిమినల్ కేసులు, 237 సివిల్ కేసులు, 711 చెక్ బౌన్స్ కేసులు పరిష్కారమయ్యారన్నారు. 93 మోటారు వాహన ప్రమాద క్లయిమ్‌లకు రూ. 67.04 కోట్లు నష్టపరిహారం ఇవ్వడానికి ఇన్సూరెన్స్ కంపెనీలు అంగీకరించాయన్నారు. 112 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించి అవార్డులను జారీ చేశామన్నారు. మచిలీపట్నం కోర్టుల్లో 1629, విజయవాడ కోర్టుల్లో 3818, గుడివాడ 1013, నందిగామ 248, నూజివీడు 918, మైలవరం 93 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. జగ్గయ్యపేట కోర్టులో 160, బంటుమిల్లి 189, కైకలూరు 881, తిరువూరు 655, గన్నవరం 152, అవనిగడ్డ 209, మొవ్వ 264, ఉయ్యూరు కోర్టులో 156 కేసులు పరిష్కరించినట్లు న్యాయమూర్తి తెలిపారు. కార్యక్రమాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చల్లంగ చూడమ్మా.. దుర్గమ్మ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మా.. దుర్గమ్మా.. మా పిల్లా పాపలను చల్లంగ చూడమ్మా... దుర్గమ్మ... వచ్చే ఏడు సారెను మరింత ఘనంగా సమర్పిస్తామమ్మా.. అంటూ భక్త బృందాలు అమ్మవారిని వేడుకుంటున్నాయి. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం రికార్డు స్థాయిలో భక్తులు బృందాలుగా ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సుమారు 15 వేల మంది భక్తులు సారెను సమర్పించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. సారె సమర్పణకు తరలివచ్చిన భక్త బృందాలతో రూ. 300, రూ. 100, సర్వ దర్శనం క్యూలైన్లు కిటకిటలాడాయి. ఆదివారం కూడా మరిన్ని బృందాలు ఇంద్రకీలాద్రికి తరలివచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు భావిస్తున్నారు.

క్లుప్తంగా

డిగ్రీ అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులైన ప్పటికీ డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ గురించి ఎలాంటి సమాచారం లేదని, వెంటనే డిగ్రీ అడ్మిషన్లను ప్రారంభించాలని ప్రగతిశీల ప్రజా స్వామ్య విద్యార్థి సంస్థ(పీడీఎస్‌వో) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ డిమాండ్ చేశారు. అడ్మిషన్ల ఆలస్యం వలన పరీక్షలు, వాటి ఫలి తాలు ఆలస్యమవడం, ఏపీపీజీసెట్, ఐసెట్ వంటి ఉమ్మడి పరీక్షలు వాయిదా పడటంతో రాష్ట్ర, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో చదవా లనుకునే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 1250 డిగ్రీ కళాశాలల్లో 4 లక్షల 50 వేలు సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఆలస్యంగా జరు గుతున్న అడ్మిషన్ల కారణంగా గతేడాది 1 లక్షా 80 వేలు సీట్లకు మాత్రమే అడ్మిషన్లు జరిగాయ న్నారు. ఈ సమస్యలు పునరావృతం కాకుండా విద్యాశాఖ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమగ్రమైన, సమర్థవంతమైన అడ్మిషన్ విధా నాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గం ఎంపిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ కార్యవర్గ సమావేశం విజయవాడలోని సిద్ధార్థ వైద్య కళాశాలలో శనివారం జరిగింది. సమావే శంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.వినాయకం, మహిళా విభాగం అధ్యక్షురాలు జి.ప్రభావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లాకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షు లుగా కె.కన్నయ్య, ప్రధాన కార్యదర్శి మంచాల సురేష్ కుమార్, ఆర్థిక కార్యదరి డి.సుందర్, ఉపాధ్యక్షులు పి.అనిల్, రజినీ, కార్యదర్శి రామకృష్ణ, సాయి, విజయ నియమితుల య్యారు. అనంతరం వారితో రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం ప్రమాణస్వీకారం చేయించారు.

కార్యకర్తలే పార్టీకి హక్కుదారులు



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ మోదుగుల, వెలంపల్లి, జోగి రమేష్, మల్లాది విష్ణు, రుహుల్లా, భాగ్యలక్ష్మి, ఆసిఫ్ తదితరులు



బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పోస్టర్ ఆవిష్కరించిన మోదుగుల, వెలంపల్లి తదితరులు

- బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ప్రజల ఆర్తనాదాలు ఆపాలంటే వైఎస్ జగన్ సీఎం కావాలి
- వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి హక్కుదారులు కార్యకర్తలే అని పార్టీ విజయవాడ పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు నమ్మి ఓట్లు వేసిన ప్రజలను మోసం చేశారని చెప్పారు. విజయవాడ ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులోని ఎస్ కన్వెన్షన్ హాలులో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' పేరుతో చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ పశ్చిమ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శనివారం జరిగింది. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ మంత్రి జోగి రమేష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, పీఏసీ సభ్యులు షేక్ ఆసిఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. తొలుత దివంగత మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాబు మోసాలను, ప్రజలకు ఇచ్చిన బాండ్లు, వైఎస్ జగన్ ప్రెస్‌మీట్‌ను స్క్రీన్‌పై వేశారు. ఇంటింటికి స్కానర్‌తో వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను వివరించాలని కోరుతూ స్కానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ జగన్ ఓడిపోయి ప్రజలు గెలిచారని, చంద్రబాబు గెలిచి ప్రజలు ఓడిపోయారన్నారు. అమెరికా వెళితే స్టాట్యూ ఆఫ్ లిబర్టీ, గుజరాత్ వెళితే స్టాట్యూ ఆఫ్ యూనిటీ చూస్తామని, 2029 లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే స్టాట్యూ ఆఫ్ బిట్రేయల్ పేరుతో చంద్రబాబు విగ్రహం పెడతామని.. ఎవరైనా మోసాలు, వంచన చేయాలంటే ఆ విగ్రహం వద్దకు వెళ్లి ఆశీర్వాదం తీసుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. చంద్రబాబు చేసిన మోసాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

కార్యకర్తలంతా సమాయత్తం కావాలి..

మాజీ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. కూటమి ప్రజా ప్రతినిధులు మట్టి, ఇసుక, బూడిద దోచుకుంటున్నారన్నారు. కూటమి ఏడాది పాలనలో పథకాలు అందక ప్రజలు ఎలా నష్టపోయారో మనం చూశామన్నారు. ఐదేళ్లు జగన్ అన్న బటన్ నొక్కారు. ఆ రోజులను తలచుకొని కూటమి నేతలను తిట్టుకుంటున్నారన్నారు. ఏడాది కాలంగా ప్రజలు, పార్టీ క్యాడర్ ఇబ్బందులు పడుతున్నారు. చంద్రబాబు ప్రజలకు వెన్నుపోటు ఎలా పొడిచాడో వివరించే అవకాశం కల్పించారని, ప్రతి కార్యకర్త సమాయత్తం కావాలన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ...వైఎస్ జగన్ ప్రజల వద్దకు వెళ్లాలని మనకు దశ దిశ నిర్దేశం చేశారన్నారు. కూటమి నేతలను నిలదీయాలన్నారు.

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. ఏడాది గడిచినా ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పేరుతో ప్రజల్లోకి వెళదామన్నారు. పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ.. బాబు మోసం చేయడం కొత్తేమీ కాదన్నారు. గతంలో 600 హామీలు ఇచ్చి మోసం చేశాడని గుర్తు చేశారు. చంద్రబాబు మోసాలను విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఎండగట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్నాటి రాంబాబు, తోలేటి శ్రీకాంత్, జమల పూర్ణమ్మ, కార్పొరేటర్లు చైతన్యరెడ్డి, ఆంజనేయరెడ్డి, బాపతి కోటిరెడ్డి, శీరం పూర్ణచంద్రరావు, పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

280 మంది మందుబాబులకు జరిమానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 280 మందికి పోలీసులు గుర్తించారు. వారిని 6వ, 7వ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్(రైల్వే కోర్టు) కోర్టులో ప్రవేశ పెట్టగా న్యాయమూర్తులు లెనిన్ బాబు, ఆర్‌పీఎస్ శర్మలు వారికి రూ.28.45 లక్షలు జరిమానా విధించారు. కాగా తొమ్మిది మందికి ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున జరిమానా విధించగా, మిగిలిన 271 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు జరిమానా విధించారు. రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

బాత్రూమ్ కిటికీ అద్దాలు తొలగించి బంగారం చోరీ



బాత్రూమ్ కిటికీ అద్దాలు తొలగించిన దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో బాత్రూమ్ కిటికీ అద్దాలు తొలగించి చోరీ చేసిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వైట్ల విజయలక్ష్మి భర్త వీరవెంకట సురేష్‌కుమార్‌తో కలిసి గుణదల స్టార్ విల్లాలో నివసిస్తున్నారు. సురేష్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున నిద్రలేచిన విజయలక్ష్మి బయటకు వచ్చి చూసేసరికి ఇళ్లు మొత్తం తలుపులు తీసి ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చిన ఆమె బెడ్‌రూమ్ కబోర్డ్స్ ఓపెన్ చేసి చూడగా అందులో ఉండాల్సిన బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్ కనిపించలేదు. బాత్రూమ్ కిటికీ అద్దాలు తీసి ఉన్నాయి. బాత్రూమ్ కిటికీ అద్దాలు తొలగించి ఇంట్లోని సుమారు 200 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించారు. దీంతో ఆమె గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న గుణదల పోలీసులు, సీఐ వాసిరెడ్డి శ్రీనివాసరావు, క్లూస్ టీమ్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సీసీ పుటేజీలను పరిశీలించగా గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు.

విద్యా రంగ సమస్యలపై 10న మహా ధర్నా



మహాధర్నా వాల్ పోస్టర్ ఆవిష్కరించిన పీడీఎస్‌యూ నేతలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 10న విజయవాడ ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.భాస్కర్, ఎం.వినోద్ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో మహాధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయిందని, కానీ విద్యారంగ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పాఠశాల విలీన ప్రక్రియ వలన వేలాది పాఠశాలలు మూతపడుతున్నాయన్నారు. విద్యార్థులకు రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయి పడిందన్నారు. జీవో 77 వల్ల పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు పీజీ విద్యకు దూరమవుతున్నారన్నారు. 2024-25లో తల్లికి వందనం పథకం అమలు చేయలేదన్నారు. మెడికల్ కళాశాలలు ప్రైవేట్ పరం చేయడం, కళాశాల భూములు కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతున్నారని దుయ్యబట్టారు. హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచకపోవడం తదితర సమస్యల పరిష్కారానికి జూలై 7న అన్ని జిల్లా కేంద్రాల్లో, జూలై 10న విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్, ఉపాధ్యక్షుడు ఎస్.మహర్షి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.నాని, రాష్ట్ర కమిటీ సభ్యులు మానస, ప్రసన్న, సింధు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15లోగా 'పీ-4' పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ చిత్రంలో జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): మార్గదర్శిలతో బంగారు కుటుంబాల అనుసంధానం చేసే ప్రక్రియను ఆగస్టు 15వ తేదీలోగా పీ- 4 కార్యక్రమంలో భాగంగా పూర్తి చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి పీ-4, స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాలపై అధికారులు, వివిధ వర్గాల సంఘాల ప్రతినిధులతో శనివారం సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 67 వేల కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించామని, జీవితంలో ఉన్నతంగా స్థిరపడిన ధనికులను గుర్తించి మార్గదర్శిలుగా ఎంపిక చేయాలన్నారు. వారిని బంగారు కుటుంబాలతో ఆన్‌లైన్‌లో అనుసంధానం చేసి దత్తత తీసుకునేలా చొరవ చూపాలన్నారు. జిల్లా అధికారులందరూ మొదట పీ-4 కార్యక్రమాన్ని ఆదివారం నుంచే ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ, వార్డు సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని అందులోని సిబ్బంది చురుకుగా గ్రామాల్లో తిరిగి ముఖ్యంగా అక్కడి పాఠశాలల్లో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్న పూర్వ విద్యార్థులను మార్గదర్శిలుగా గుర్తించాలన్నారు. ఉన్నత స్థానాల్లో ఉన్న వారు గ్రామాల్లో పేద ప్రజలకు సహాయం చేసేందుకు ముందుకు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో డ్వామా, డీఆర్డీఏ, మెప్మా, ఐసీడీఎస్ పీడీలు శివప్రసాద్, హరిహరనాథ్, సాయిబాబు, ఎంఎన్ రాణి, జిల్లా పశుసంవర్థక అధికారి చిన్ననరసింహులు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరాం ప్రసాద్, డీఎంహెచ్‌వో శర్మిష్ఠ, ఉద్యాన అధికారి జ్యోతి, సీపీవో భీమరాజు, మార్కెటింగ్ ఏడీ నిత్యానందం, మార్క్‌ఫెడ్ డీఎం మురళీకృష్ణ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థ ప్రాముఖ్యతపై అవగాహన అవసరం



గౌరవ వందనం చేస్తున్న ఆప్కాబ్ చైర్మన్ వీరాంజనేయులు, కేడీసీసీబీ చైర్మన్ రఘురామ్

చిలకలపూడి(మచిలీపట్నం): సహకార వ్యవస్థ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా కేడీసీసీ బ్యాంకు ఆవరణలో సహకార జెండాను ఎగురవేసి గౌరవవందనం చేసి, ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం సమావేశపు హాలులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేడీసీసీ బ్యాంకును స్థాపించిన భోగరాజు పట్టాభి సీతారామయ్య ఉంగుటూరు వాసి కావటం తనకెంతో గర్వకారణంగా ఉందన్నారు. సమగ్రతతో కూడిన శక్తివంతమైనది సహకార వ్యవస్థ అన్నారు. ప్రతి రైతు ఇది నా వ్యవస్థ అనుకునే విధంగా సహకారం అందిస్తామని చెప్పారు. అలాగే మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్నామన్నారు. దేశంలో అగ్రగామి బ్యాంకుగా కేడీసీసీ బ్యాంకు ఉండటం గర్వకారణమన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తూ సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు.

465 బ్రాంచ్‌లు, 2,065 మైక్రో బ్రాంచ్‌లు..

కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం శ్రీరఘురామ్ మాట్లాడుతూ.. ఖాతాదారులకు ప్రత్యక్ష సహకారం అందించేది సహకార వ్యవస్థేనన్నారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావులు స్థాపించిన కేడీసీసీ బ్యాంకు అన్నింటి కన్నా మిన్నగా ఉండటం గర్వకారణమన్నారు. జిల్లాలో నాల్గవ బ్యాంకుగా ఉండటం అభినందనీయమన్నారు. ఆప్కాబ్ ఎండీ శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ సహకార వ్యవస్థలో మార్పులు వచ్చాయంటే అది కేడీసీసీ బ్యాంకు ద్వారానే సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో 465 బ్రాంచ్‌లు, 2,065 మైక్రో బ్రాంచ్‌ల ద్వారా కమర్షియల్ బ్యాంకులకు తక్కువ కాకుండా సేవలు అందిస్తున్నారన్నారు. తొలుత బ్యాంకు సీఈవో ఎ.శ్యామ్‌మనోహర్, కేడీసీసీ బ్యాంకు వ్యాపార లావాదేవీల వివరాలను వివరించారు. కార్యక్రమంలో ఆప్కాబ్ సీజీఎంలు వెంకటరత్నం, రామచంద్రయ్య, కేడీసీసీబీ జనరల్ మేనేజర్లు బీఎల్ చంద్రశేఖర్, రంగబాబు, 13 జిల్లాలకు చెందిన డీసీసీబీల సీఈవోలు, జీఎంలు పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్య పరిష్కారానికి మ్యాజిక్ డ్రెయిన్లు



సోమవరంలో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

నందిగామరూరల్: భూగర్భ జలాల పెంపుతో పాటు మురుగు నీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా మ్యాజిక్ డ్రెయిన్ల విధానాన్ని ప్రవేశపెడుతున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. మండలంలోని సోమవరం గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద వినూత్నంగా ప్రవేశపెడుతున్న మ్యాజిక్ డ్రెయిన్ విధానాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం, భూగర్భ జలాల పునరుద్ధరణను మెరుగుపరుస్తూ మురుగు నీటి దుర్వాసన, దోమల వ్యాప్తిని అరికట్టడమే మ్యాజిక్ డ్రెయిన్ల లక్ష్యమన్నారు. ఈ విధానం ద్వారా గృహాల నుంచి విడుదలయ్యే మురుగు నీరు ప్రత్యేకంగా రూపొందించిన కందకం ద్వారా నేరుగా భూమిలోకి చేరుతుందని తెలిపారు. ఖర్చుతో కూడుకున్న కాంక్రీట్ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రత్యామ్నాయంగా మ్యాజిక్ డ్రెయిన్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వెయ్యి రూపాయల ఖర్చుతో 100 మీటర్ల మ్యాజిక్ డ్రెయిన్‌ను నిర్మించవచ్చని చెప్పారు. పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన నమూనా విజయవంతమైతే జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన గ్రామంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. గ్రామంలోని మోటపోతుల ఆదినారాయణ పొలంలో కలెక్టర్ మునగ విత్తనాలు నాటగా, సృష్టి సంపద కేంద్రం వద్ద పీడీ రాము కొబ్బరి మొక్క నాటారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రాము, ఏపీడీ శ్రీనివాసరావు, ఏపీవో శరత్‌బాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి అడ్మిషన్లు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి రెండో దశ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతితో పాటు 8వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కూడా ఐటీఐలో ప్రవేశానికి అవకాశం కల్పించామన్నారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేటప్పుడు తప్పులు లేకుండా చూసుకోవాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకుని దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు ఈ నెల 17వ తేదీలోగా ప్రిన్సిపాల్‌తో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని చెప్పారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి అయిన వారికి మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇతర వివరాలకు 0866-2475575, 94906 39639, 77804 29468 నెంబర్లలో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.